క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ



గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–1 వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం గిరి ప్రదక్షిణ జరిగింది. పౌర్ణమి సందర్భంగా ఉదయం ఆరు గంటలకు ప్రారంభమైన గిరి ప్రదక్షిణ ఆద్యంతం గోవింద నామస్మరణతో సాగింది. ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, ఉదయ కృష్ణమాచార్యులు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అంతకు ముందు వేకువజామున స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విద్యార్థులకు పుస్తకాల వితరణ

పెదగంట్యాడ: నిర్వాసితుల సంఘం నాయకుడు, పీబీఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పులి వెంకటరమణ జన్మదినాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు గురువారం పుస్తకాలు పంపిణీ చేశారు. 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి చిన్నారులకు పుస్తకాలు అందజేశారు. పులి సురేష్‌రెడ్డి, నామాల పెంటయ్య, దొమ్మేటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

'మా నమ్మకం నువ్వే జగనన్న' నినాదంతో ప్రజల్లోకి..

- ప్రభుత్వం చేస్తున్న మంచిని వారికి వివరించాలి
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- పార్టీ కన్వీనర్లు, గృహసారథులకు దిశానిర్దేశం



65వ వార్డులో స్టిక్కర్లను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు



స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు

పెదగంట్యాడ: మాట మీద నిలబడే వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 98శాతం నెరవేర్చి, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్న ఘనత ఆయనకే చెందుతుందన్నారు. దానిని ప్రతిబింబిస్తూ మా నమ్మకం నువ్వే జగనన్న నినాదంతో ప్రజల్లోకి వెళ్లాలని పిలుపునిచ్చారు. జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని సచివాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆకలితో ఉన్న వాడికి అన్నం పెట్టడం ఎంత ముఖ్యమో, పేద కుటుంబాలకు సంక్షేమ పథకాలను అందజేయడం కూడా అంతే ముఖ్యమన్నారు. పార్టీ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించాలన్నారు. అనంతరం 'మా నమ్మకం నువ్వే జగనన్న' స్టిక్కర్లను ఆవిష్కరించారు. వాటిని ప్రతీ ఇంటిపై అతికించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, నాయకులు మార్టుపూడి పరదేశి, గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, కులుకూరి మంగరాజు, కొయ్య భారతి, గొందేశి వెంకటరమణారెడ్డి, గంట్యాడ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

- ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వివరించి పార్టీని క్షేత్ర స్థాయిలో మరింతగా బలోపేతం చేయాలని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు కోరారు. వార్డులోని పార్టీ కార్యాలయంలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి, వాటిని తీర్చాలన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి కులుకూరి మంగరాజు, చిక్కా సత్యనారాయణ, మంగునాయుడు తదితరులు పాల్గొన్నారు.
- సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు వలంటీర్లతో కలసి ప్రజల వద్దకు వెళ్లి గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి తేడాను వివరించాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి కోరారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజలకు చెప్పాలన్నారు. వైఎస్సార్ సీపీ 76వ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ ఆధ్వర్యంలో వార్డు పరిధిలోని సచివాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి కులుకూరి మంగరాజు, తాటికొండ జగదీష్, అచ్యుత్, పరంకుశం ప్రమీల తదితరులు పాల్గొన్నారు.



85వ వార్డులో కిట్లు అందిస్తున్న రామచంద్రరాజు

అగనంపూడి: మా నమ్మకం నువ్వే జగనన్న నినాదంతో ప్రతీ గడప తట్టాలని సచివాలయాల మండల కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు సూచించారు. 85వ వార్డు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్ల సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నాయకులు ఇల్లపు ప్రసాద్, నక్కా రమణబాబు, సాలాపు అచ్చిబాబు, గెద్దాడ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

- 79వ వార్డు షిర్డీ సాయినగర్‌లో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మినాయుడు, రామచంద్రరాజు ఆధ్వర్యంలో 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమంపై అవగాహన కల్పించారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మామిడి శ్రీను, తమ్మిన శ్రీహర్ష, నెల్లి రమణమ్మ, గుర్రం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రోగి ఇంటి వద్దే ప్రభుత్వ వైద్య సేవలు

ప్రారంభమైన 'ఫ్యామిలీ డాక్టర్'



రెడ్డి తుంగ్లాంలో రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ రామకృష్ణ



ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య బృందం

గాజువాక: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కుటుంబ డాక్టర్ (ఫ్యామిలీ ఫిజీషియన్) సేవలు గాజువాకలో గురువారం ప్రారంభమయ్యాయి. గాజువాక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వై.రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని రెడ్డితుంగ్లాంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య బృందం చిరు వ్యాధులతో బాధపడుతున్న రోగులకు, ముగ్గురు గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, మందులను ఉచితంగా అందజేశారు. అనంతరం, బాలింతలకు ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. పిల్లలకు ఆరు నెలల పాటు తల్లిపాలను మాత్రమే ఇవ్వాలని, ఆరు నెలల తరువాత అనుబంధ ఆహారాన్ని అందజేయాలని సూచించారు. 15 మంది బీపీ, ఏడుగురు షుగర్ వ్యాధి రోగులను పరీక్షించి నెలకు సరిపడా మందులను అందజేశారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలోని చిన్నారులను పరీక్షించారు. మంచంపై ఉండి తమ పనులు తాము చేసుకోలేని రోగుల ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు చేసి, మందులను అందజేశారు. ఈ సందర్భంగా వారికి ఆరోగ్య సూచనలు చేశారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్యాధికారి పి.నాగ అప్పారావు, ఆరోగ్య విస్తరణాధికారి ఎస్.ఎస్.వి.ఎన్.రాజు, ఆరోగ్య పర్యవేక్షకుడు కె.కిశోర్ కుమార్, వార్డు హెల్త్ సెక్రటరీలు, ఆశ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యమం మరింత ఉధృతం

కూర్మన్నపాలెం: ఉక్కు ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు తెలిపారు. ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకునేందుకు దేశ రాజధాని ఢిల్లీ దద్దరిల్లేలా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 784వ రోజుకు చేరుకున్నాయి. సంస్థకు చెందిన సీవో, సీసీపీ డిపార్ట్‌మెంట్ కార్మికులతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు జగన్ మురారి ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దీక్షలో పాల్గొన్నారు. దీక్ష శిబిరాన్ని సాయంత్రం సందర్శించిన సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ జగన్ మురారికి నిమ్మరసం ఇచ్చి, దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ, మంత్రి రాజశేఖర్, ఆదినారాయణ మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముకుంటూపోతే భారతదేశంలో ఏ సంస్థ మిగలదన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

కల్యాణ మండపాలు, చేపల చెరువులకు 10న వేలం

గాజువాక: గాజువాక జోన్‌లోని జీవీఎంసీకి చెందిన వివిధ కల్యాణ మండపాలు, చేపల చెరువుల నిర్వహణ, చెట్ల ఫలసాయానికి ఈ నెల 10న వేలంపాట నిర్వహించనున్నట్టు గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం తెలిపారు. ఈ నెల 4న నిర్వహించిన వేలం పాటలో సర్కారు వారు నిర్ణయించిన పాట ధరకు ఉత్సాహం చూపకపోవడంతో సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు మళ్లీ బహిరంగ వేలం నిర్వహించనున్నామని పేర్కొన్నారు. మూడేళ్ల లీజు కాలనికి ద్రోణంరాజు కల్యాణ మండపం, దేశపాత్రునిపాలెం కల్యాణ మండపం, రావాడ రావుల చెరువు (సత్తివానిపాలెం), దేశపాత్రునిపాలెం చెరువు, కొబ్బరి చెట్ల ఫలసాయానికి, మింది జీవీఎంసీ దుకాణాల్లోని రెండు, నాలుగు బ్లాకులకు వేలం నిర్వహించనున్నామన్నారు. ఏడాది కాలానికి కూర్మన్నపాలెం రావుల చెరువు పార్కింగ్ ఫీజు, సందర్శన, గోపాలరెడ్డినగర్ పంప్‌హౌస్ కొబ్బరితోట, వుడా కాలనీ మామిడిచెట్లకు వేలం వేస్తామన్నారు. వేలం పాటలో పాల్గొనదలచినవారు డిపాజిట్ చెల్లించి హాజరుకావాలని కోరారు.

త్రిశక్తి ఆలయంలో చండీ హోమం



హోమం జరిపిస్తున్న రుత్వికులు

ఉక్కునగరం: స్థానిక త్రిశక్తి దేవాలయంలో గురువారం దుర్గా సప్తశతి చండీ హోమం నిర్వహించారు. చైత్ర పౌర్ణమి సందర్భంగా వేకువజామున శ్రీమహాలక్ష్మి, శ్రీమహాదుర్గ, శ్రీమహాసరస్వతి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం దుర్గాదేవి సన్నిధిలో రుత్వికులు చండీ హోమం నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్టీల్‌సిటీ డిపోలో ఆరు కొత్త బస్సులు ప్రారంభం



కొత్త బస్సులను ప్రారంభిస్తున్న అప్పలనాయుడు

ఉక్కునగరం: ఆర్టీసీ స్టీల్‌సిటీ డిపోలో ఆరు కొత్త అద్దె బస్సులను గురువారం ప్రారంభించారు. డిపో ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆర్టీసీ విశాఖ రీజియన్ డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ బి.అప్పలనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన డ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రమాదాలు తగ్గించి, ఇంధనం ఆదా చేస్తున్న ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కొత్త టెక్నాలజీతో కూడిన బస్సులను ఏర్పాటు చేశామన్నారు. డ్రైవర్లు అప్రమత్తంగా ఉండి ఆర్టీసీకి ఆదాయం వచ్చేలా సహకరించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డిపో మేనేజర్ రమణమూర్తి, ఏఈ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలపై కేంద్ర మంత్రికి వినతి



కేంద్ర ఉక్కు సహాయమంత్రి ఫగ్గన్‌ను కలిసిన నాయకులు, ఉన్నతాధికారులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలను కేంద్ర ఉక్కుశాఖ సహాయమంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తేకు అసోసియేషన్ నాయకులు వివరించారు. న్యూఢిల్లీలోని ఉద్యోగ భవనంలో వివిధ ప్రభుత్వరంగ సంస్థలకు చెందిన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాలు, ఆ సంస్థల ఉన్నతాధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ నుంచి అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, అధ్యక్షుడు బి. తాడన్న, హెచ్‌ఆర్ సీజీఎం కె. శ్రీనివాసరావు, హెచ్‌ఆర్ జీఎం కె. సంజీవరావు సమావేశానికి హాజరయ్యారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న అధికారుల పదోన్నతులు, ప్రస్తుతం సీజీఎం హోదాలో ఒక్క ఎస్సీ, ఎస్టీ లేని విషయాన్ని మంత్రి దృష్టికి తెచ్చారు. నాన్ ఎగ్జిక్యూటివ్స్‌కు జూనియర్ ఆఫీసర్ పరీక్షలు నిర్వహించాలని, స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగించడం ద్వారా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలపై అక్కడి ఉక్కు ఉన్నతాధికారులపై చర్చించి, తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించినట్టు నాయకులు తెలిపారు.

అమ్మవారి చీరలు పేదలకు పంపిణీ



పేదలకు చీరలు అందిస్తున్న దిశ సీఐ లక్ష్మి

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు కొండయ్యవలస వాసుల ఆరాధ్యదైవం మరిడిమాంబ అమ్మవారి నెలవారి పండగ సందర్భంగా భక్తులు కానుకగా సమర్పించిన చీరలను ఆలయ కమిటీ నిరుపేదలకు పంపిణీ చేసింది. కార్యక్రమంలో పాల్గొన్న అనకాపల్లి దిశ పోలీస్‌స్టేషన్ సీఐ టి.లక్ష్మి, శ్రీనివాస్ రెడ్డి దంపతుల చేతుల మీదుగా ముందుగా అమ్మవారికి విశేష పూజలు జరిపించారు. అనంతరం చీరల పంపిణీ చేపట్టారు. ఆలయ కమిటీ చైర్మన్ బలిరెడ్డి శ్రీను ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న మాధవ్

గాజువాక: బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని గాజువాక ప్రాంతంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పలుచోట్ల ఆ పార్టీ జెండాలను నాయకులు ఆవిష్కరించారు. వుడా కాలనీ జంక్షన్, చినగంట్యాడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ జెండాను ఆవిష్కరించారు. పార్టీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 14 వరకు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు దీనంకొండ కృష్ణంరాజు, బాటా శ్రీను, శశిధరణ్ పిళ్లై, గరికిన పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

- పెదగంట్యాడ జంక్షన్‌లో పార్టీ జెండాను కరణంరెడ్డి నర్సింగరావు ఆవిష్కరించారు. కిల్లాన ముసలయ్య, డాక్టర్ శ్రీనివాసరావు, యెల్లబిల్లి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

'వార్షిక నివేదికలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలి'



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

అక్కిరెడ్డిపాలెం: యాన్యువల్ ఫైనాన్షియల్ సర్వే రిపోర్టును పరిశ్రమలు ప్రతీ సంవత్సరం ఆన్‌లైన్‌లో పొందుపరచాలని నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ కె.రాజశేఖర్ తెలిపారు. ఆటోనగర్ పరిశ్రమలతో పాటు నగరంలోని పరిశ్రమలు, సంస్థలకు చెందిన చార్టర్డ్ అకౌంటెంట్లు, అకౌంటెంట్లకు సంస్థల వార్షిక ఆర్థిక సర్వే నివేదికలను ఆన్‌లైన్‌లో పొందుపరచడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆటోనగర్‌లోని వాసీవాలో నిర్వహించిన కార్యక్రమంలో నేషనల్ స్టాటిస్టికల్ కార్యాలయ అధికారులు డెమో ద్వారా తెలియజేశారు. వాసీవా అధ్యక్షుడు ఎ.కె.బాలాజీ మాట్లాడుతూ రిపోర్టులను ఆన్‌లైన్ చేయడంలో పారిశ్రామిక వేత్తలకు సహకరించాలని అధికారులను కోరారు. ఎంఎస్ఎంఈ ఏడీ చంద్రమౌళి, వాసీవా కార్యదర్శి డి.వినోద్, నేషనల్ స్టాటిస్టికల్ కార్యాలయం ఇన్‌చార్జి సూపరింటెండెంట్ స్వామి, పలువురు పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

దువ్వాడ రైల్వేస్టేషన్‌లో లిఫ్ట్ సౌకర్యం



నాలుగో నంబర్ ప్లాట్‌ఫాంపై వినియోగంలోకి వచ్చిన లిఫ్ట్

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో నాలుగో నంబర్ ప్లాట్‌ఫాంపై లిఫ్ట్ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. వారం రోజుల క్రితమే లిఫ్ట్ వినియోగానికి వీలుగా అధికారులు ఏర్పాటు చేశారు. వందలాది మంది ప్రయాణికులు నాలుగో నంబర్ ప్లాట్‌ఫాం వైపు వాహనాలు పార్క్ చేసి ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం పై నుంచి విజయవాడ వైపు రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే విజయవాడ వైపు నుంచి వచ్చే ప్రయాణికులు నాలుగో నంబర్ ప్లాట్‌ఫాంపై దిగి లగేజీలు, పిల్లలతో ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం వైపు వెళ్తున్నారు. గతంలో ఫుట్ ఓవర్ వంతెన పైనుంచి లగేజీలు, వృద్ధులు, పిల్లలతో ప్లాట్‌ఫాం దాటడానికి ఇబ్బంది పడేవారు. లిఫ్ట్ అందుబాటులోకి రావడంతో ప్రయాణికులకు ఈ వెతలు తప్పనున్నాయి.

జంక్ ఫుడ్‌తో ఆరోగ్య సమస్యలు



డాక్టర్ రవి కన్న

అక్కిరెడ్డిపాలెం: జంక్ ఫుడ్‌తో ఎన్నో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని షీలానగర్ కిమ్స్ ఐకాన్ కన్సల్టెంట్ ఇంటర్నల్ మెడిసిన్ వైద్యులు డాక్టర్ ఆర్.వి.రవికన్న అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఆస్పత్రిలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జంక్‌ఫుడ్ వల్ల కలిగే ఆరోగ్య సమస్యలను వివరించారు. ఆరోగ్య సంరక్షణకు ప్రతీ రోజు క్రమం తప్పకుండా వ్యాయామం, సమతుల ఆహారం తీసుకోవాలని సూచించారు. మద్యం, ధూమపానం అలవాట్లను మానేయాలన్నారు. బయట దొరికే జంక్ ఫుడ్స్‌ను దూరంగా ఉంచాలని తెలియజేశారు.

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదాతకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: రాఘవ రెడ్డి హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో 74వ వార్డు అంబేడ్కర్ కాలనీలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో సుమారు 50 మంది రక్తదానం చేశారు. వీరికి సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్లు ఉరుకూటి చందు, పల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

9న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

సింహాచలం : విశాఖ ఆరువేల నియోగి బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 9న అన్ని శాఖల బ్రాహ్మణుల వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం ప్రతినిధి ఎస్‌వీఆర్ మూర్తి తెలిపారు.పెందుర్తి మండలం సుజాత నగర్ కాలనీలో సంఘం సుమావేశం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన వివరాలు తెలిపారు. ఎంవీపీకాలనీలోని (ఎంవీపీ సర్కిల్) భద్రం కమిటీ హాల్లో ఈనెల 9న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు వివాహ పరిచయ వేదిక జరుగుతుందన్నారు. బ్రాహ్మణులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇప్పటి వరకు 250 మంది వరకు నమోదు చేసుకున్నారన్నారు. 9వ తేదీన కూడా నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. సమావేశంలో బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు సూర్యప్రతాప్, శ్రీనివాసరావు, పిన్నమరాజు సత్యనారాయణ, రమణమూర్తి, ఎం.సత్యనారాయణమూర్తి, సరోజిని, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత యోగా శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఏయూ క్యాంపస్: రుషి గాయత్రి యోగా కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించే 14 రోజుల ఉచిత యోగా శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. లాసన్స్‌బే కాలనీలోని సంస్థ కార్యాలయంలో ఈ నెల 9న సాయంత్రం 6 గంటల నుంచి తరగతులు ప్రారంభమవుతాయని కేంద్రం నిర్వాహకులు తెలిపారు. 20 మందికి మాత్రమే ప్రవేశం కల్పిస్తామని, ఆసక్తి కలిగిన వారు 94403 95439, 77801 54103 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

పోలమాంబ ఆలయ ఆదాయం రూ. 8.46 లక్షలు

ఏయూక్యాంపస్: పోలమాంబ ఆలయ వార్షిక జాతర అనంతరం హుండీల లెక్కింపు గురువారం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో లెక్కింపు చేపట్టగా.. 17 రోజులకు రూ. 8,46,145 ఆదాయం లభించింది. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి పసన్న లక్ష్మి, దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ పి.శంకర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల పరిధిలో జరుగుతున్న సెమిస్టర్ పరీక్ష కేంద్రాలను రెక్టార్ ఆచార్య కె.సమత గురువారం పరిశీలించారు. భౌతిక శాస్త్ర విభాగంలో జరుగుతున్న సెమిస్టర్ పరీక్షలను తనిఖీ చేశారు. ప్రశాంత వాతావరణంలో పటిష్టంగా పరీక్షలు నిర్వహించడంపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్ష కేంద్రాలలో వసతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.